www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 23 జులై 2025 | 5 | పశ్చిమ గోదావరి

7న చలో విజయవాడ జయప్రదం చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

భీమవరం : ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడంతోపాటు రూ.46 వేలు వేతనాన్ని నిర్ణయించి అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 7వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విద్యుత్ సౌధా కార్యాచరణకి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ముజఫర్ అహ్మద్ మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న 24 వేలమంది కార్మికులకు అన్లిమిటెడ్ మెడికల్ పాలసీని, హెల్త్ కార్డులను ఇవ్వాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, డిస్కం అధ్యక్షులు శ్రీనివాస్, సురేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థులు

- గతేడాదితో పోలిస్తే 4 వేల మంది తగ్గుదల
- ప్రభుత్వ విధానాల ఫలితంగా ప్రయివేటు బాటలో విద్యార్థులు
- గత నాలుగేళ్లలో 52,656 మంది విద్యార్థులు తగ్గుదల
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు క్రమేణా నిర్వీర్యమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నాలుగు వేల మందికిపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. ఈ నాలుగేళ్ల గణాంకాలు పరిశీలిస్తే సుమారు 52 వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. దీన్ని సరి చేయాల్సిన జిల్లా విద్యాశాఖ పట్టనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో సర్కారీ బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలకు వత్తాసు పలుకూ వారికి అనుకూలమైన విధానాలు అవలంబిస్తోంది. నూతన విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకొచ్చి పాఠశాలల విలీనంతో విద్యార్థులను పాఠశాలలకు దూరం చేస్తోంది. అయితే విద్యాహక్కు చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయడంలో జిల్లా విద్యాశాఖ పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలున్నాయి. డ్రాప్‌వుట్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నాగరాణి పదేపదే చెబుతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారులు సరిగా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల మనుగడే ప్రమాదంలో పడుతోంది. 2024 - 25లో జిల్లాలోని 1,492 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 89,600 మంది విద్యార్థులు విద్య అభ్యసించారు. 2025-26 సంవత్సరంలో ఈ సంఖ్య 85,344కు తగ్గింది. అంటే 4,256 మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రస్తుతం విద్యార్థుల చేరికలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అంచనా వేస్తోంది. జిల్లాలోని 1,920 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 2,79,204 మంది విద్యార్థులున్నారు. 2024-25లో పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తొమ్మిది వేల మందికిపైగా 72 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్స్ తీసుకొచ్చారు. ప్రైమరీలో రెండు మీడియంల విధానం తీసుకొచ్చి చిన్న పిల్లలకు బరువు తగ్గేలా పుస్తకాల్లో మార్పులు తెచ్చారు. విద్యార్థులకు విద్యా కిట్లు అందించారు. తల్లికి వందనం ఎట్టకేలకు కొంతమేర అమలు చేశారు. అయినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగలేదు. దీనికి కారణాలపై దృష్టి పెట్టాల్సిన విద్యా శాఖాధికారులు కనీసం స్పందించకపోవడం, కలెక్టర్ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నాలుగేళ్లలో 52 వేల మంది విద్యార్థులు తగ్గుదల

జిల్లాలో నాలుగేళ్లలో గణాంకాలు పరిశీలిస్తే సుమారు 52,656 మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యారు. 2021-22 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లక్షా 38 వేలు కాగా, 2023-24లో 99 వేల మందికి తగ్గింది. 2024-25లో 89,600కు పడిపోయింది. ఈ ఏడాది 2025-26లో ఇప్పటికి 85,344 మంది ఉన్నారు. గతేడాదితో పోలిస్తే సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి

జి.ప్రకాశం, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి ప్రధాన కారణం ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చడం. తల్లిదండ్రులు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందదని భావిస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకూ వర్తింపజేయడం మరో కారణం. గ్రామంలో ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తే ప్రభుత్వం కచ్చితంగా ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది. ప్రభుత్వం ఆ విధంగా ఆలోచన చేయాలి.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు 40 మంది విద్యార్థులు ఉండాలని చెబితే గత ప్రభుత్వం 40 నుంచి 59కి పెంచింది. ఈ ప్రభుత్వం దాన్ని 40 మందికి తగ్గించకుండా 53గా నిర్దేశించింది. గతంలో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ప్లస్ 2 తీసుకొచ్చి దాన్ని 12వ తరగతి వరకూ పెంచారు. ఈ సంస్కరణల్లో భాగంగా ఆరు రకాల పాఠశాలలను తీసుకొస్తే ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు కూడా అప్పట్లో విమర్శించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా 9 రకాల పాఠశాలలుగా చెప్పి గందరగోళం సృష్టిస్తోంది. విద్యారంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ఒక పాఠశాలను అదనంగా పెట్టాలి. ఒక టీచర్‌ను అదనంగా ఇవ్వాలి.

ప్రయివేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు

టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టకుండా వాటిని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక వసతులపై విస్తృతంగా ప్రచారం చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి కారణం ప్రభుత్వ విద్యా విధానమే.

పిహెచ్‌సి వైద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం

వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు - కలెక్టర్ చదలవాడ నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి నెలా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం వహించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పిహెచ్‌సిలకు వచ్చే రోగులకు వైద్య సేవలందించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా 3 వేలు ఓపి, 10 డెలివరీలు చేయాల్సిందేనని ఆదేశించారు. రోగుల నుంచి సిబ్బంది సొమ్ము వసూలు చేసినట్లు తెలిస్తే సంబంధిత ఉద్యోగులు, సిబ్బందిని సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంగళవారం కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు, స్త్రీ శిశుసంక్షేమ శాఖల పనితీరుపై వైద్యాధికారులు, ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, పిహెచ్‌సి డాక్టర్లు, సూపర్‌వైజర్లు, సిడిపిఒలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లతో రోగులకు ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, ప్రసవాలు, మాతా శిశు ఆరోగ్యం, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆపరేషన్లు, ల్యాబ్ పరీక్షలు తదితర అంశాలపై సమీక్షించారు. లక్ష్యసాధనలో కొన్ని పిహెచ్‌సిలు వెనుకబడడంపై ఆగ్రహం వ్యక్తం చేసి మాట్లాడారు. ఇది పేదల ఆరోగ్యానికి సంబంధించిన అంశమని, అందించే సేవల ద్వారా పేద ప్రజల నమ్మకాన్ని పొందాలని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై రోగులకు వైద్య సేవలందిస్తే ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. గర్భిణులకు కాన్పు జరిగే వరకూ అవసరమయ్యే వైద్య పరీక్షలు, పౌష్టికాహారంపై వారికి పూర్తి అవగాహన కల్పించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగే విధంగా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఒక మలేరియా కేసు కూడా నమోదు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించి అన్ని అంశాల్లో జిల్లాకు ఏ గ్రేడ్ వచ్చే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి, డిసిహెచ్ ఎస్ పి.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ డి.లక్ష్మి, జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్లు, సిడిపిఒలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

తణుకులో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గత 17 రోజుల సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల వేతనం రూ.26 వేలకు పెంచాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు కొద్ది రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా విరమించినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని అవకాశవాద సంఘాలు రాష్ట్ర ప్రభుత్వంతో కుమ్మక్కై సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను సిఐటియు అడ్డుకుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఆగస్టు మొదటి వారం తర్వాత సమ్మెను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధనాల వెంకటరావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడికొండ జయరాం, ఉపాధ్యక్షులు కొడమంచిలి బాబు, కార్యదర్శి ధనాల రాజు, కొడమంచిలి ప్రసాద్, సతీష్, తాడికొండ భాను, కె.దయామణి పాల్గొన్నారు.

తణుకు: మున్సిపల్ కార్మికులు కొద్ది రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా విరమించినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ తెలిపారు. అయితే ముందుగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి రిలయన్స్ ఆఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ కార్యదర్శి ఎన్.ఆదినారాయణ బాబు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 17 రోజుల సమ్మె కాలంలో జీతాలు పెంచలేదన్నారు.

సమ్మె విరమణ

మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సంక్షేమ పథకాలు, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు, సమ్మె జీతాలు, ఇతర సమస్యలపై 10 రోజుల్లో ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారం చేస్తామని మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులకు హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మె విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, గంగాధర్, అర్జి కృష్ణబాబు, ఎస్.పద్మ, కె.అయ్యప్ప, ఎ.అరుణా దేవి, ఇ.సుధాకర్, యర్రంశెట్టి మంగమ్మ, నాగేంద్ర కుమార్, కేశవ, మందులయ్య పాల్గొన్నారు.

చేపల చెరువులే ముద్దు.. వరి రైతులు వద్దు..!

- ఉంగుటూరు మండలం రావులపర్రు ఘటనే నిదర్శనం
- గతంలో నిడమర్రు మండలంలో ఇదే తరహా ఘటనలు అనేకం
- నారుమడులు, పంటలు ముంచేస్తున్నా చర్యలు తూతూమంత్రమే
- నారుమడులు మునిగినా ఏంకాదంటూ అధికారుల ప్రకటనలు హాస్యాస్పదం
- ప్రజాప్రతినిధులు, అధికారులంతా చేపల చెరువుల యాజమానులకే వత్తాసు
- వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారుల తీరుపై రైతుల ఆవేదన

నీటమునిగిన నారుమడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'వరి పంటను దెబ్బతీస్తే.. చేపలు తిని బతుకుతారా' అంటూ గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కాటంనేని భాస్కర్ చేసిన వ్యాఖ్యలు ఇవి. చేపల యజమానులకు వత్తాసు పలుకుతూ వరి సాగును దెబ్బతీసే చర్యలకు దిగుతున్న అధికార యంత్రాంగం తీరుపై అప్పట్లో కలెక్టర్ భాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉంగుటూరు మండలం రావులపర్రు ఘటన అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. చేపల చెరువుల యజమానులకు లాభం చేకూర్చేందుకు 150 ఎకరాలకు సంబంధించి వరి నారుమడులను ముంచేసిన పరిస్థితి నెలకొంది. రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగితే తప్ప వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో కదలిక లేకుండా పోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో డెల్టా ఆయుకట్టు పరిధిలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలు సాగించిన యాజమానులకు ప్రజా ప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకూ అంతా వత్తాసు పలుకుతూ వరి సాగు చేసే రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. ఉంగుటూరు మండలం రావులపర్రు లాకుల వద్ద నీరు పూర్తిస్థాయిలో మురుగుబోదెలోకి వెళ్లిపోతే చేపల చెరువులకు నష్టం వాటిల్లుతుందని చెక్కలు అడ్డుగా వేస్తున్న పరిస్థితి. దీంతో నీరు వెనక్కి ఎగదన్ని పెద్ద ఎత్తున నారుమడులు మునిగిపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటో చెప్పనక్కర్లేదు. నారుమడులు దెబ్బతిని రైతులు లబోదిబోమంటూ రోడ్డెక్కితే అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల చెరువుల యాజమాన్యాలకు అండగా మాట్లాడుతున్న తీరు అత్యంత దారుణమని చెప్పొచ్చు. నారుమడులు మునిగి రైతులు తీవ్ర ఆవేదనలో ఉంటే నాలుగు రోజులు నీటిలో మునిగినా ఏమీ కాదంటూ అధికారులు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గంగా ఉన్నాయి. నారుమడులు మునగడానికి దారి తీసిన పరిస్థితులపై మాట్లాడకుండా అందుకు విరుద్ధంగా వ్యాఖ్యలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. స్థానిక ఎంఎల్ఎ సైతం చేపల చెరువుల యజమానులకు అండగా నిలుస్తున్నారంటూ రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. రావులపర్రు ఘటనే కాదు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు మండలంలోనూ చేపల చెరువుల కోసం వరి పంటలను సైతం ముంచేసిన ఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. రైతులు రోడ్డెక్కినప్పుడు తాత్కాలిక చర్యలు తీసుకోవడం తప్ప వరి రైతులకు ఇబ్బంది లేకుండా శాశ్వత చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

నిడమర్రు మండలంలోనే అనేక ఘటనలు

నిడమర్రు మండలం అడవికొలనులోనూ చేపల చెరువుల కారణంగా వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉప్పునీటి రొయ్యల సాగు చేస్తూ ఆ నీటిని పంట పొలాల్లోకి వదిలేస్తున్నారు. దీంతో అడవికొలను గ్రామంలోని కలందాకోడు పాయ పంటలు పండని పరిస్థితి నెలకొంది. పంట పక్వానికి వచ్చే దశలో నీరు వదిలేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీనిపై తహశీల్దార్, జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు ఆందోళనలు చేసిన ఘటనలు ఉన్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు, అనేక నియోజకవర్గాల్లో వరి రైతుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల చెరువుల యాజమాన్యాల నుంచి మామూళ్లు దండుకుని వరి రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేపల చెరువులు సాగు చేసుకుంటున్న యాజమానులు పంట కాలువలను బాగు చేసేందుకు ఏమాత్రమూ సహకరించడం లేదని రైతులు చెబుతున్నారు. పంట కాలువలను ఆక్రమించుకుని నీరు కిందకు దిగకుండా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సరిగ్గా వ్యవహరించకపోవడం కారణంగా వరిసాగు ఇబ్బందుల్లో పడుతుందన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. రావులపర్రు రైతుల పరిస్థితి మరెక్కడా రాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పాలకొల్లు : ప్రభుత్వాలు మారినా పేదవాడి ఇళ్ల సమస్య పరిష్కారం కావడంలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్ల ను పూర్తిచేసి సౌకర్యాలు కల్పించి అర్హులైన వారికి వెంటనే అందించాలని ఎర్ర వంతెన వద్ద జిల్లా సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేసారు. పాలకొల్లులో ఇళ్ల స్థలం కొనుగోలు చేసి 18 సం. రాలు గడిచినా నేటికీ ఇళ్లు పూర్తి కాలేదని అన్నారు. అర్హులు కొంతమంది చనిపోయారన్నారు. ప్రభుత్వాలకు పేదవాడి ఇంటి సమస్య పట్టడం లేదని అన్నారు. టిడ్కో ఇళ్ల ప్రాంతాలలో విష సర్పాలు సంచారంతో ప్రజలు భయ భ్రాంతులు అవుతున్నారని, పొదలు, పారిశుధ్య సమస్య ఉందని వీటిని మెరుగపరచాలన్నారు. ప్రజలకు నివాసయోగ్యంగా ఉండేటట్లు ఇళ్లు నిర్మించి వెంటనే అందించాలని డిమాండ్ చేసారు. సిపిఎం నేతలు బి.వాసుదేవరావు, జవ్వాది శ్రీనివాసరావు, దిగుపాటి రాజగోపాల్, చల్లా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరందక అవస్థలు

పడమటిపాలెంలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఆచంట వేమవరంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం శివారు పడమటిపాలెం దళితవాడలో తాగునీరు సదుపాయం ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. పడమటి పాలెం దళితవాడలో మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్ప రాజ్ మాట్లాడుతూ గత కొంతకాలంగా పడమటిపాలంలోని బిసి కాలనీలో మంచినీరు సదుపాయం ఏర్పాటు చేసి దళితవాడలో మాత్రం మంచినీరు సదుపాయం లేకుండా చేయటం వివక్షని, దీనిపై గతంలో పంచాయతీ కార్యదర్శిని చరవాణిలో అడగగా తొందరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఇప్పటివరకు మంచినీరు ఇవ్వకపోవడం దారుణమని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామంలో ముఖ్యంగా దళితవాడలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించలేదని, కనీసం కచ్చా డ్రెయిన్ తవ్వకోటానికి దళితవాడలో ఉన్న డబ్బులతో తవ్వడం జరుగుతుందన్నారు. ఎస్‌సి ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఏమైపోతున్నాయని ప్రశ్నించారు. ప్రజల నుంచి వచ్చిన కష్టార్జితంతో పన్నుల రూపంలో వసూలుచేసి అధికారులకు ప్రభుత్వం జీతాలు చెల్లిస్తుంటే అధికారులు కనీసం గ్రామస్థాయిలో నివాసం ఉండకుండా, సమస్యలు తెలుసుకోకుండా, సమస్యలు పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వాధికారులు దళితవాడలకు ముఖ్యంగా పడమటిపాలెం గ్రామస్తులకు మంచినీరు సదుపాయం కల్పించి, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాలన్నారు. లేకపోతే రానున్న రోజుల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిల్లి స్వరూపరాణి, తరపట్ల గంగారత్నం, పాక జ్యోతి, పిల్లి రాంప్రసాద్, పాక సుగుణ రావు, పొలుమూరి స్వర్ణలత, మైలే ఆనందరావు, చిలకపాటి సూర్యకుమారి, మైలే మరియమ్మ, చేరుగొండి కవిత, గొల్లపల్లి శశిరేఖ పాల్గొన్నారు.

అచ్యుతానందన్ ఆశయ సాధనకు కృషి

సిపిఎం ఆధ్వర్యాన ఘన నివాళి

అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

తణుకు : కేరళ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు విఎస్.అచ్చుతానందన్‌కి సిపిఎం పట్టణ కమిటీ ఘనంగా నివాళులర్పించింది. మంగళవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యాన పూలమాలలతో నివాళులర్పించి జోహార్ విఎస్.అచ్చుతానందన్, సాధిస్తాం మీ ఆశయాలను అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ విఎస్.అచ్చుతానందన్ సమసమాజం కోసం పార్టీలో చేరిన నాటి నుంచి తుది శ్వాశ విడిచే వరకు పని చేశారన్నారు. ఒక టైలర్‌గా జీవితం ప్రారంభించిన అచ్చుతానందన్ కేరళ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, స్వాతంత్ర సమరయోధుడుగా మన్ననలు పొందారని తెలిపారు. జీవితాంతం ప్రజల కోసం పనిచేయడమే కాకుండా చివరికి తన దేహాన్ని కూడా మెడికల్ ఆసుపత్రికి పరిశోధనల నిమిత్తం ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన 101 సంవత్సరాలు చాలా క్రమశిక్షణగా జీవించారని అన్నారు. సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, అంబటి రామకృష్ణ, కె.నాగరత్నం పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న సముద్రపు అలలు

పర్యాటకులు బీచ్‌కు రావొద్దు : ఎస్ఐ

ఎగసిపడుతున్న సముద్రపు అలలు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్ప డిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సముద్ర అలలు ఉధృతంగా మారాయి. దీంతో కెరటాలు ఎగసిపడుతున్నాయి. సముద్రంలో స్నానాలు చేయడం ప్రమాదకరంగా మారడంతో పర్యాటకులను అనుమతించడంలేదని ఎస్ఐ జి.వాసు పర్యాటకులకు సూచించారు. తరువాత ప్రకటన వెలువడే వరకూ బీచ్‌కు రావొద్దని ఆయన పర్యాటకులకు సూచించారు.

ఎఫ్‌టిఎస్‌ను ఉపసంహరించుకోవాలి

రవాణా కార్మికుల వాహనాలకు భద్రత కల్పించాలి

కలెక్టరేట్ వద్ద ఎపి టాక్సీటనర్స్ కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ధర్నా

డిఆర్‌ఒకు వినతి పత్రం అందిస్తున్న రవాణా కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

రవాణా వ్యవస్థ మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన ఆటోమేటిక్ ఫిట్నెస్ టెస్టింగ్ సిస్టమ్(ఎఎఫ్‌టిఎస్)ను ప్రభుత్వం తక్షణం ఉపసంహరించాలని కోరుతూ ఎపి టాక్సీటనర్స్ కమ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా లారీ, టాక్సీ, ఆటో అసోసియేషన్ ప్రతినిధుల జాయింట్ యాక్షన్ కమిటీ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఎటిఎస్ ప్రక్రియ విఫలమైందన్న వాస్తవాన్ని పలు విధాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదినారాయణ(బాబా) మాట్లాడుతూ మోటారు వాహనాల నిర్వహణలో అత్యంత కీలకమైన రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యవసరమైన వాహన ఫిట్నెస్ నిర్వహణకు సంబంధించిన బాధ్యతలను గుత్తేదారులకు, వ్యాపారధోరణి కలిగిన వ్యక్తులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం భావించడం దారుణమన్నారు. రాష్ట్ర కోశాధికారి దొమ్మేటి సోమశంకరరావు, రావికృష్ణ, వేపకాయల సత్యనారాయణ, శీలం శ్రీను, ఆకుల శ్రీను మాట్లాడుతూ చట్టభద్రత, ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న రవాణా శాఖకు చెందిన బాధ్యులు మాత్రమే ఫిట్నెస్‌ను నిర్ధారించే కార్యక్రమంలో విధులను నిర్వహించాలని, లేదంటే రోడ్డు రవాణా సంస్థ భ్రష్టుపట్టడం ఖాయమన్నారు.

ఎస్ఐఆర్ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదకరం

రాష్ట్రంలో రాజకీయ పార్టీలు తమ వైఖరి తెలపాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి - పాలకొల్లు

కేంద్ర ఎన్నికల సంఘం బీహార్‌లో చేపడుతున్న ఎస్ఐఆర్ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. మంగళవారం పాలకొల్లు పట్టణంలో సిపిఎం జిల్లాస్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణ తరగతులు కోకోనట్ మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ 11 ఏళ్లలో తమ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఎజెండాను శరవేగంగా అమలు చేస్తోందని మండిపడ్డారు. అయితే రాజకీయంగా లేదా రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకొని రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపూర్ణ మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేయాలనే బిజెపి కుట్రను ప్రజలు ఓట్ల ద్వారా తిరస్కరించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఉపయోగించుకునే ఓటు హక్కును కూడా కాలరాసేలా ప్రయత్నిస్తోందన్నారు. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమన్నారు. పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయని తెలిపారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం అని కానీ హోంమంత్రి ఆదేశాలతో ఓటరు లిస్ట్‌ను మార్చేసే లక్షలాది మంది ఓటు హక్కు నిరాకరించి బిజెపికి రాజకీయ లబ్ది చేకూర్చాలన్న పథకంలో భాగస్వామ్యం కావడం దారుణమన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు జరుగుతాయనగా బీహార్‌లో ఈ ప్రత్యేక సునిశిత పరిశీలన లక్ష్యం ఆ రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం మాత్రమే కాదని, బిజెపి, ఆర్ఎస్ఎస్ మతతత్వ ఎజెండా అమలులో కీలక పరిణామమని తెలిపారు. ఈ ఎస్ఐఆర్ బీహార్‌కు మాత్రమే కాకుండా దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిందని గుర్తుచేశారు. గత కొన్ని సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణ(సిఏఏ), జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్ఆర్సి) చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుందని, బిజెపి మతతత్వ ఆజెండాలో భాగంగా అమలు చేస్తున్న ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆగస్టు 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కారు పెద్దిరాజు, కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.కళ్యాణి, పి.పూర్ణ, కేతా పద్మజ, మాజీ ఎంఎల్‌సి దిగుపాటి రాజగోపాల్, పాలకొల్లు ఏరియా కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు రాంభూపాల్

మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గం

వైసిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి

భీమవరం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబును మించిన నేరగాడు దేశంలో ఎక్కడా లేరని, చంద్రబాబు కంటే మద్యం కుంభకోణాలు చేసేవారు కూడా ఎవరూ లేరని వైసిపి జిల్లా మహిళ అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి అన్నారు. మంగళవారం భీమవరంలోని వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని, ప్రతిపక్షంగా అమలు చేసిన మద్యం విధానంపై అక్రమ కేసు నమోదు చేయడమేమిటని, రెడ్ బుక్ కుట్రలని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో సాగుతున్న కుట్ర కేసులో సిట్ దర్యాప్తు పేరిట బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంచినీళ్లు దొరకడం లేదని.. మద్యం మాత్రం ఏరులై పారుతూ ఎక్కడైనా దొరుకుతుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజల్ని తప్పు దోవ పట్టించాలనుకోవడం భ్రమ మాత్రమేనన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఆధారం కూడా చూపలేకపోయిందని, వేధింపుల కోసమే ఈ తప్పుడు అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించి, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని, ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం అత్యంత దుర్మార్గమన్నారు. రాజకీయ కక్షతో మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసారని విజయలక్ష్మి అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

తాగునీటి ఇబ్బందులు పరిష్కరించండి

'సుపరిపాలనలో తొలి అడుగు'లో స్థానికులు

నరసాపురం : పట్టణంలోని 25, 26 వార్డుల్లోని ఆదర్శ్ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామరాజు ప్రతి ఇంటిని వ్యక్తిగతంగా సందర్శించి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలైన తాగునీటి కష్టాలు, డ్రైనేజీ సమస్యలు, నిరంతర కరెంటు లోపం వంటి అంశాలను రామరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన రామరాజు మీ సమస్యలు పరిష్కరించడమే బాధ్యత, ప్రతి సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రబాబు, మాచర్ల ఆనంద్, దొంగ పద్మారావు, ఆకాశపు వేణు, సంధర్శ సూర్యనారాయణ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

నరసాపురం: గ్రామంలో చాలాకాలం నుంచి ప్రజలు లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంలో స్పందనలో కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. ఆమె ట్రాన్స్‌కో అధికారులతో చర్చించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందుకు గ్రామానికి కావాల్సిన ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో గ్రామంలోని చాలా ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య తీరింది. దీంతో మంగళవారం మాజీ ఉపసర్పంచులు వైఎస్.బాబులు, ఉప సర్పంచి వాసులతో పాటు మరికొంత మంది కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యను పరిష్కరించినందుకు గాను ఆమెకు పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్‌ను అభినందించినట్లు తెలిపారు. మేడిద శ్రీనివాస్ ఉన్నారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్

జాతీయ రహదారి నిర్మాణంపై అభ్యంతరాల స్వీకరణ

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జాతీయ రహదారి 165కు సంబంధించి రోడ్డు 150 అడుగులు నిర్మాణం కానున్నదని జెసి రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇటీవల కొత్తగా మార్చిన అలైన్మెంట్ ప్రకారం మండలంలోని అజ్జమూరు గ్రామం గుండా ఈ రోడ్డు సాగుతున్నందున ఆ గ్రామస్తుల అభ్యంతరాలను జెసి ఇటీవల స్వీకరించారు. వీటిపై ప్రజలతో ముఖాముఖి చర్చించేందుకు మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో ఆ గ్రామానికి చెందిన పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గ్రామంలోని శ్మశానం గుండా ఈ రోడ్డు అలైన్మెంట్ ప్రకటించారని, ఆ శ్మశానం తమకు అవసరమని అందువలన మార్చాలని గ్రామస్తులు కోరారు. ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెబుతూ పంట భూమికి, నివాస స్థలాలకు, వాణిజ్య స్థలాలకు భిన్నమైన ధరలు ఉంటాయని హామీ ఇచ్చారు. అవార్డు ప్రకటించిన స్థలానికి ప్రభుత్వ ధరకి రెండున్నర రెట్లు ధర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి పూర్తి చట్టబద్ధమైన రీతిలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని ఏ విధమైన నష్టం ప్రజలకు జరగదని ఆయన హామీ ఇచ్చారు. కాగా మొత్తం 43 అభ్యంతరాలు వచ్చాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, డిడి జి.కళ్యాణి, జాతీయ రహదారుల విభాగం డిఇ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మురికి కూపంగా మూలలంక కాలువ

ప్రజాశక్తి - ఆకివీడు

వానొస్తే రోడ్డు మొత్తం మురికి నీరే

కాలువ గట్టున ఇళ్లు ఖాళీ చేయించి 8 నెలలు..

నేటికీ ప్రారంభించని తవ్వకం పనులు

మూలలంక కాలువ తవ్వకం పనులు చేపట్టి కాలువను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని ఆ గట్టునున్న నిర్మాణాలను ఖాళీ చేయించి సుమారు ఎనిమిది నెలలు దాటింది. నేటికీ అక్కడ కనీసం పని ప్రారంభించలేదు. కాలువ మురికికూపంగా మారి దుర్వాసన భరించలేని పరిస్థితి ఏర్పడింది. వాన వస్తే మురికి నీరు పొంగి రోడ్డంతా మురికి గుంటగా మారుతుంది. ఇది ఇక్కడ దుస్థితి. స్థానిక ఉప్పుటేరు పాయ చినకాపవరం డ్రెయిన్ గట్టు వద్ద ఉన్న పంటచేలకు నీరందించే కాలువ ఈ మూలలంక కాలువ. దీంతోపాటు రెండు మంచినీటి చెరువులకు ఇన్పుట్‌గా కూడా ఈ కాలువ నిర్మాణం చేశారు. సుమారు రెండు శతాబ్దాల క్రితం ఏర్పడిన ఈ కాలువ ప్రధాన లక్ష్యం అది. ఈ కాలువ స్థానిక వెంకయ్య కాలువ నుంచి విడివడి సుమారు అర కిలోమీటర్ ప్రయాణం చేసి ఆకివీడు మెయిన్ రోడ్డు వద్ద జాతీయ రహదారిని దాటి, ఒకప్పటి ప్రధాన మంచినీటి చెరువైన దొరగారి చెరువుకి ఇన్పుట్‌గా ఈ కాలువ సేవలు ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచి మరింత ముందుకు సాగుతూ రైలు పట్టాల కింద నుంచి ముందుకు సాగి రెండు భాగాలుగా విడిపోయేది. ఒక భాగం ఉప్పుటేరు చినకాపవరం డ్రెయిన్‌లో కలిస్తే మరోభాగం దుంపగడప గ్రామానికి మంచినీటి చెరువు ఇన్పుట్‌గా వెళ్లేది. దారిలో ఉప్పుటేరు వద్ద కలిసే భాగంలో నీరు అదే ప్రాంతంలో ఉన్న సుమారు 70 నుంచి 80 ఎకరాల పంటచేలకు సాగునీరుగా వినియోగపడేది. ఇన్ని రకాల సేవలు అందించిన మంచినీటి, సాగునీటి కాలువ కాలక్రమంలో సుమారు రెండు దశాబ్దాల నుంచి మూలపడింది. దుంపగడప నీటికి ఆ మార్గం ద్వారా దారి మూతపడింది. దీంతో దారిలోనే ఉన్న మూడు తూముల దగ్గర నుంచి దుంపగడప సాగునీటికి వెళ్లే కాలవ నుంచి మంచినీటి కాలవకి మార్గం ఏర్పాటు చేసుకున్నారు. ఇక దొరగారు చెరువు నీటి వాడకం తగ్గడం, నీరు అడుగంటడంతో ఆ చెరువు ఇన్పుట్ కాస్త ఆగిపోయింది. ఇక సాగునీటికి మాత్రమే ఉపయోగపడే కాలువ నీటి ప్రవాహం ఆగిపోయింది. ప్రతి ఏటా పంచాయితీ కాలవను శుభ్రం చేసి తవ్వించడంతో నీటి ప్రవాహానికి అడ్డం ఉండేది కాదు.. కాలక్రమంలో ఆ అవసరం లేకపోవడంతో నీటి పారుదల ఆగిపోయింది. అక్కడ రైతులు మాత్రం తమ గోడు ఎవరు వినకపోవడంతో ఉప్పుటేరు భాగంలో మురుగు నీరు ఇంజన్ తోడుకొని పంటలు సాగు చేసుకుంటున్నారు. అయితే ఇటీవల ఇక్కడ ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కాలువ తవ్వించి, పూడికలు తీయించి మళ్లీ కాలువలను దారిలో పెడతానన్నారు. ముందుగా కాలువ గట్టున నివసిస్తున్న నిర్మాణదారుల ఇళ్లను ఖాళీ చేయించారు. కాలువ తవ్వించి మళ్లీ పూర్తిస్థాయిలో కాలువను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ ఇళ్లను ఖాళీ చేయించి సుమారు 8 నెలలు దాటింది. గత సంవత్సరం అక్టోబర్లో ఆ స్థలాలు ఖాళీ అయ్యాయి. నేటికీ తవ్వకాలు లేవు. ఏ పని ఒక కొలిక్కి రాలేదు. కాలవ మొత్తం మురికిమయంగా మారింది. అయిభీమవరం మలుపు తిరిగేసరికి దుర్వాసన భరించలేని పరిస్థితి. వానొస్తే చాలు గట్టు మీదకి పొంగి రోడ్డు అంతా మూడు డ్రెయినేజీ నీళ్లతో నిండిపోయి మురికికూపంగా మారుతుంది. మురికి కంపు కొడుతోంది. ఆపై రోగాలు మామూలే. స్థానిక దొరగారి చెరువును బాగు చేసి మంచినీటి చెరువుగా మారుస్తామని ఇటీవల నగర పంచాయతీ పాలకవర్గం ఎంఎల్ఎకి తెలిపింది. అందుకు ఎంఎల్ఎ మద్దతు ఇచ్చారు. అయితే ఈ కాలువ బాగుపడితే తప్ప దొరగారి చెరువుకు మంచినీటి ఇన్పుట్ లేదు. ఇవన్నీ ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయో, కాలుష్యం ఎప్పటికి పోతుందో అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయిభీమవరం రోడ్డు మలుపులో మురికి కూపంగా మారిన మూలలంక కాలువ

మాతృ శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

భీమవరం : జిల్లాలో మాతృ శిశుమరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ జి.గీతబాయి అన్నారు. స్థానిక కలెక్టరేట్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి అధ్యక్షతన మాతృ శిశుమరణాలపై సబ్ కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా జులైలో జరిగిన మాతృ మరణాలు, జూన్‌లో జరిగిన అయిదు శిశుమరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ ఇక మీదట మాతృ మరణాలు జిల్లాలో జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మాతాశిశు సంరక్షణ సేవలు బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీ కళ్యాణి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఫాక్సీ ప్రతినిధి డాక్టర్ నరసవాణి, డాక్టర్ పద్మావతి, డిపిహెచ్ఎన్ఒ వెంకటరత్నం, రక్తనిధి నిల్వ అధికారి పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీరందించడమే లక్ష్యం

పారిశుధ్య జిల్లాధికారి బివి.గిరి

తాడేపల్లిగూడెం : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయాలని గ్రామీణ తాగునీరు, పారిశుధ్య జిల్లా అధికారి బివి.గిరి సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం, పెంటపాడు నియోజకవర్గాల ఎఇలతో జలజీవన్ మిషన్ ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సోమేశ్వరరావు, ఎఇ బి.రాజా శ్రీనివాస్, హేమంత్ పనుల పురోగతిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సిఎం రవికిరణ్, సైట్ ఇంజనీర్ సత్యమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలి : డిఆర్ఒ

భీమవరం : ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ వెంకటేశ్వర్లు అధ్యక్షతన కాంట్రాక్టు లెకలర్‌ల సర్వీసు కొనసాగింపుపై తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అటానమస్ బాలికల కళాశాల, భీమవరం, గణపవరం, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు సర్వీసు ఉన్న కాంట్రాక్టు లెక్చలర్‌లను వారు పనిచేస్తున్న కళాశాలలోనే కొనసాగించేలా నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే ఐదేళ్లపైబడి సర్వీసు పూర్తి చేసుకున్న అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ అభ్యర్థన మేరకు అదే కళాశాలలో తిరిగి కొనసాగేలా నిర్ణయించడం జరిగిందన్నారు. పేద, మధ్యతరగతి తరగతుల ప్రజలు చదువుకునే ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకులు వారికి మంచి చదువు అందించి ప్రయోజకులను చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

'బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి'

పెనుమంట్ర : మండలంలోని 18 గ్రామాల్లో మంగళవారం పి-4 బంగారు కుటుంబాల కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని భట్లమగుటూరు గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర రావు, ఎంఇఒ యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామంలో సేవా భావం కలవారు పి-4 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని, తద్వారా గ్రామాలలో పూర్తిగా పేదరికాన్ని నిర్మూలించవచ్చని వారు అన్నారు. స్థానిక టిడిపి గ్రామ అధ్యక్షులు జంగం చిట్టిబాబు, జనసేన గ్రామ అధ్యక్షులు బయ్యే బాలాజీ, బిజెపి గ్రామ అధ్యక్షులు పేర్రాజు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు పాలమూరు రాజేష్టి, డిపి ప్రధాన కార్యదర్శి గంటా శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి. సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతాయుతంగా పనిచేయాలి : ఎంపిడిఒ

కాళ్ల : ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్స్ తమ వృత్తిలో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలని ఎంపిడిఒ జి.స్వాతి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో వీక్లీ రివ్యూ మీటింగ్‌లో భాగంగా నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా గ్రామాల వారీగా గుర్తించిన పనులపైన, జరుగుతున్న అభివృద్ధిపైన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. కూలీల మస్తర్లను ఎప్పటికప్పుడు రోస్టర్‌లో నమోదు చేసుకుంటూ రికార్డు రూపంలో సంబంధిత శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. విధుల్లో ఎవరు అలసత్వం వహించవద్దని బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ లక్షా 50 వేల పనిదినాలకు 1,37,434 పని దినాలు మాత్రమే చేయడం జరిగింది. మిగతా 12,566 పని దినాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం ఎపిడి భీమవరం క్లస్టర్ డ్వామా ఆఫీస్ వారు మండలంలోని 2024-25, 2025-26 సంవత్సరాల రికార్డు వెరిఫికేషన్ చేయనున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరూ మొత్తం అన్నిరకాల రికార్డు పెండింగ్ వర్క్ అంతా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంటేషన్‌కు సంబంధించి ఎస్టిమేట్‌లు ఇంకా పెండింగ్ ఉన్న వాటికి ఎస్టిమేట్ వేయాలన్నారు. కాటిల్ షెడ్ మండలంలో ఈ సంవత్సరం 20 షెడ్స్‌ను కేటాయించడం జరిగింది. ఈ 20 మంది లబ్ధిదారులను రెండు రోజులు గుర్తించి ఎస్టిమేట్ లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కంప్యూటర్ ఆపరేటర్ కె.శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

పెనుమంట్ర : మండలంలోని ఆలమూరు గ్రామంలో దళిత రత్న డాక్టర్ అంబేద్కర్ పేరిట భవనం నిర్మాణం కోసం తగిన స్థలాన్ని కేటాయించడంతో పాటు, నిర్మాణం కోసం రూ.20 లక్షల గ్రాంట్ ఇవ్వాలని ఆ గ్రామ ఎస్‌సిలు వినతి పత్రం ఇచ్చారని స్థానిక మండల తహశీల్దార్ వై.రవికుమార్ మంగళవారం ఇక్కడ తెలిపారు. అదేవిధంగా పెనుమంట్ర రెవెన్యూ పరిధిలో తనకు ఉన్న వ్యవసాయ భూమి తగ్గినందున, సర్వే చేయాలని స్థానిక రైతు తేతలి ప్రదీప్ కుమార్ రెడ్డి అర్జీ ఇచ్చినట్టు ఆయన చెప్పారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

దాత అలుగు సెబాస్టిన్ పాఠశాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నారని స్పెషల్ మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి.రామరాజు అన్నారు. పెదఅమిరం గ్రామానికి చెందిన అలుగు సెబాస్టిన్ సొంత నిధులతో స్పెషల్ మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.45 వేల విలువైన విద్యా సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ప్రతి ఏటా అలుగు మోక్షానందం-మరియమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు అలుగు సెబాస్టిన్ విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రిని అందించడం అభినందనీయమని గ్రామ సర్పంచి బుక్ సోమేశ్వరరావు దాత సెబాస్టిన్‌ను అభినందించారు. పాఠశాలలో టైల్స్ ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.70 వేలతో పనులు చేపట్టారు. విద్యార్థులకు వంట చేసేందుకు సుమారు రూ.18 వేల విలువైన స్టవ్ అందజేశారు. ఈ సందర్భంగా దాత అలుగు సెబాస్టిన్ ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు బిరుదుగడ్డ జాషువా, ఉపాధ్యాయులు జి.సునీత, బిబి.మణి, టి.కనకదుర్గ పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న సెబాస్టిన్

కొత్త కాలనీకి రహదారి వేయండి

కాశిపాడు ప్రజలు ఎంఎల్‌ఎకి విజ్ఞప్తి

గణపవరం : కాశిపాడులో కొత్త కాలనీకి వెళ్లటానికి గత రెండేళ్లుగా రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని, రహదారి వెంటనే వేయాలని మంగళవారం గ్రామంలో జరిగిన పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో స్థానిక ప్రజలు ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకు వినతిని అందజేశారు. కాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉంటున్నారని చెప్పారు. రోడ్డు వేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామంలో మంచినీటి సమస్య ఉందని చెప్పారు. దీంతో ధర్మరాజు మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారానికి గ్రామంలో ఉన్న కాశమ్మ చెరువుతోపాటు వెంకాయమ్మ చెరువును కూడా మంచినీరు పెట్టి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదవారిని డబ్బు ఉన్న ప్రతివారు దత్తత తీసుకొని వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని చెప్పారు. చిలకంపాడులో జరిగిన సమావేశంలో వరిసాగుకి నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెప్పారు. తన పదవి కాలంలో సమస్యలు పరిష్కారం చేస్తానని చెప్పారు. వీరేశ్వరపురం వాకపల్లి, వల్లూరు గ్రామాల్లో పల్లెపల్లెకు సభలు జరిగాయి. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, తహశీల్దార్ వై.అప్పారావు, ఎడి ప్రసాద్ పాల్గొన్నారు.

పాపారావును సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

లయన్స్ గవర్నర్ పాపారావు నాయుడుకి సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

అమెరికాలోని ఓర్లండో నగరంలో జరిగిన లయన్స్ అంతర్జాతీయ 107వ కన్వెన్షన్ 316 జి లయన్స్ గవర్నర్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేసి పాలకొల్లు తిరిగివచ్చిన సన్ షైన్ స్కూల్ అధినేత లయన్స్ ఎన్‌వివిఎస్ పాపారావు నాయుడు, అన్నపూర్ణ దంపతులకు ఘన స్వాగతం లభించింది. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో క్లబ్ అధ్యక్షుడు లయన్స్ శిడగం సతీష్ నేతృత్వంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ముందుగా మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. లయనిజం వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ విగ్రహానికి ముందుగా గవర్నర్ దంపతులు పూలమాల సమర్పించి గౌరవ వందనం చేశారు. మాజీ గవర్నర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి, చాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.కామేశ్వరరావు, జిల్లా కోశాధికారి కారుమూరి రామలింగేశ్వరరావు, నందుల సీతారామరావు, రీజియన్ చైర్‌పర్సన్ నందుల రమణి పాపారావు నాయుడు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కొమ్ముల మురళీకృష్ణ, రేపాక ప్రవీణ్, పి.వరప్రసాద్ సతీష్, దొండపాటి చిట్టిబాబు, కెబి.ఫణీంద్రుడు, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పనులు చేపట్టాలి : ఎంఎల్ఎ

తణుకు : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి పథకాలకు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే పనులు చేపట్టాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎల్ఎ రాధాకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ గ్రాంటులో వాటర్ గ్రిడ్ పనులకు సంబంధించి రూ.1400 కోట్లు అంచనా వేయగా సుమారు రూ.250 కోట్లుతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అత్తిలి మండలంలో సుమారు రూ.4.50 కోట్లు, ఇరగవరం మండలంలో రూ.49 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.3.56 కోట్లు నిధులతో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులకు అంచనాలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎఇలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.11/2024 in O.S.No.58/2013

DHR : చీపురుపల్లి పార్వతి
And
JDR :
పోతుల వెంకటనాగ రంగ రవికుమార్ వగైరా
JDRS : 1. పోతుల వెంకటనాగ రంగ రవి కుమార్, S/o.సుబ్బారావు, డోరునెం.3-13, రాయలం గ్రామం, భీమవరం మండలం.
2.పోతుల వైజయంతి, W/o.వెంకటనాగ రంగ రవికుమార్, డోరునెం.3-13, రాయలం గ్రామం, భీమవరం మండలం.

పై నెంబరు పిటీషను నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొనివుండుట లేదు. అందువలన మీరు ది.**04-09-2025** సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు పిటీషను తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

భీమవరం — **కె.వి.రమేష్,** భీమవరం
తేది.18-07-2025 — DHR తరపు న్యాయవాది.

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో
H.M.O.P.No.137/2024

బిట్వీన్:
వాసా రాజశ్రీ అనే తాళ్ల రాజశ్రీ ...Petitioner
అండ్
వాసా సురేష్‌కుమార్ ...Respondent
టు,
వాసా సురేష్, తండ్రి గంగాధర్ రావు, వాలమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు పిటిషనులో పిటిషనరు మీ నుండి విడాకులు కోరుతూ పై కోర్టులో దాఖలు చేసి, పై కోర్టు నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు పిటిషనరును ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంలో నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. అందుకు శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం Substitute సర్వీస్ గా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు ది.**7-8-2025** సం. తేదీన వాయిదా వేసియున్నారు. కావున ది.**7-8-2025** సం.తేదిన ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని శ్రీకోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

గూడూరి శంభూప్రసాద్
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం/పాలకొల్లు
తేది.16-07-2025 — సెల్: 9490988095

మున్సిపల్ యూనియన్ నాయకులు పూర్ణిమ మృతి

తాడేపల్లిగూడెం : మున్సిపల్ అవుట్ సోర్సింగ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ అల్లం పూర్ణిమ చికిత్స పొందుతూ మంగళవారం సాయంకాలం మృతిచెందినట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈనెల 17వ తేదీన బస్టాండ్ కూడలి వద్ద మెయిన్ రోడ్‌పై విధులు నిర్వహిస్తూ స్పృహతప్పి పడిపోవడంతో తోటి కార్మికులు ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్ అయిందని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం రాజమండ్రిలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. ఈమె మృతిపట్ల సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల వెంకటరావు, కొడమంచిలి బాబు పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్ (కొత్తపేరు) డోర్‌నెం.1-128/1 పెదపేట, చర్చ్ దగ్గర, మత్స్యపురి గ్రామం, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరు కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణపతి (పాతపేరు) నుండి కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్ (కొత్తపేరు)గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

కొల్లాబత్తుల నరేష్, తండ్రి గణేష్,
డోర్‌నెం.1-128/1, పెదపేట, మత్స్యపురి,
వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.

డాక్యుమెంట్స్ పోయినవి

చెరుకువాడ సువర్ణ రాణి, భర్త, సంతోషరావు, డోర్ నెంబర్ 29-3-29, యాళ్ళవాని గరువు, పాలకొల్లు రూరల్ పంచాయతీ, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా కుమార్తె మేరీ రోసీ సొంత ఇంటి స్థలం డాక్యుమెంట్స్ ఆర్ఎస్ నెంబర్ 275/2,280/2, 280/3, మొత్తం 222.22 చ.గజములు దగ్గరలో 8-1 డోర్ నెంబర్, పామూరు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా, డాక్యుమెంట్ నెంబర్ 9686/2023, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, పాలకొల్లు ద్వారా 22-9-2023 తేదీన సంక్రమించినది. ఈ డాక్యుమెంట్ జెరాక్స్ తీయించుటకు ది.22-02-2025న మాఇంటి నుంచి యడ్లబజార్ సెంటర్‌లో జెరాక్స్ కాపీలు తీయించుటకు స్కూటీ పై వెళుతుండగా దారిలో పడి పోయినవి. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 6309285456

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), వారి కోర్టులో, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
I.A.No.207 of 2024 in O.S.No.44 of 2020

Between :
భల్లే రామకృష్ణ ...Plaintiff
And
కట్టా దుర్గాలక్ష్మి and 2 Others ...Defendants
To.
శ్రీమతి వేముల సావిత్రి, W/o.లక్ష్మణరావు, మేజర్, ఆడ, కొండయ్య చెఱువు, శేషమహల్ దగ్గర, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా - 534101.

పై నెంబరు గల గ్రంథములో దావా మరియు పిటీషన్ విచారణలోవున్నది. మరియు మీరు దావాలో 3వ ప్రతివాదిగా మరియు పిటీషన్‌లో 3వ రెస్పాండెంట్‌గా వున్నారు. మీ నాన్నగారు నా క్లయింటు (వాది) వద్ద డబ్బులు తీసుకొని అదేరోజున అనగా తే.12-7-2019 దిన ప్రామిసరీ నోటు వ్రాయించి ఇచ్చియున్నారు. కావున పై విషయములో నా క్లయింట్ భల్లే రామకృష్ణ అనువారు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జంగారెడ్డిగూడెం నందు మీ నాన్న గారి మరణా నంతరం పై దావా మీపై వేసియున్నారు. ఈ విషయంలో గౌ॥శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు పంపియున్నారు. మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక పోవుట వలన శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **తే.06-08-2025** దిన వాయిదా వేసియున్నారు. అని తెలియజేయుట జరిగినది. కావునా **తే.06-08-2025** దిన ఉదయం 10.30 గంటల లగాయితు మీరు స్వయముగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షముగా నిర్ణయం తీర్మానించబడును.

వాయిదా తేది:06-08-2025

కొల్లూరు సతీష్, అడ్వకేట్,
జంగారెడ్డిగూడెం.

I.A. నోటీసు
భీమడోలు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
I.A.No.42/2024 in O.S.No.76/2023

మధ్య :
బొప్పన కోటేశ్వరరావు ...పిటీషనర్ /వాది
మరియు
బొప్పన విజయభాస్కరరావు మరియు 13 ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

R4-Dharmana Naresh, S/o.Naga Raju, Resident of Near Kanalamma Water Tank, Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R5-Dharmana Subbamma, D/o.Naga Raju, Resident of Near Kanalamma Water Tank, Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R8 - Lakshmimsetti Parvathi, W/o.Prasad, Kothuru, Resident of Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R9-Lakshmimsetti Durga Devi, D/o.Prasad, Kothuru, Resident of Kovvali Village, Denduluru Mandal, Bhimadole JCJ.
R12- Boppana Srinu @ Srinivasa Rao, S/o.(Late) Subba Rao, Resident of D.No.20E-1-20, Chodididda, Eluru, Eluru EJCJ.
R13- Boppana Peasu, S/o.(Late) Subba Rao, Hindu, Male, Aged 35 Yrs, Resident of Pallapuru Village (M.M.Puram), Bhimadole Mandal, Bhimadole JCJ.

పై దావాలో 2వ ప్రతివాది కాలం చేసినందున దావా ప్లెయింట్‌లో తగు అమెండ్‌మెంట్ చేయగలందులకు అనుమతి కోరుచూ పై ఐ.ఏ.నెం.42/2024 పిటీషను దాఖలు చేసినందున యిందు విషయమై ఆక్షేపణలున్న ది.31-07-2025న పగలు 10 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరైై కోర్టు వారితో మనవి చేసుకోని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయడమగును. ఈ పేపరు ప్రకటన శ్రీకోర్టు వారి ది.17-6-20025 ఉత్తర్వుల అనుసారమైయున్నది.

ముఖ్య గమనిక: న్యాయసేవాధికార సంస్థ ద్వారా అర్హతను బట్టి ఉచిత న్యాయ సహాయం కూడా అందుబాటులో కలదు.

శియ్యాద్రి జగదీశ్వరరావు
పిటీషనర్/వాది తరపు న్యాయవాది
ఏలూరు — పవర్‌పేట, ఏలూరు.
తేది: 23-07-2025 — సెల్: 8956899999